epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 | సంచిక : 175 | ఆదివారం, 23 నవంబర్ 2025 | పేజీలు : 04



## గిరిజన బిడ్డకు.. కాంగ్రెస్ పట్టం

### జనగామ డీసీసీ అధ్యక్షురాలిగా ధన్వంతి

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ జిల్లాల డీసీసీ అధ్యక్షులను నియమించింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌లోని అన్ని జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఇనగల వెంకటరామిరెడ్డి, వరంగల్ అధ్యక్షుడిగా మహమ్మద్ అయూబ్, ములుగు జిల్లా అధ్యక్షుడిగా పైడాకుల అశోక్, జనగామ జిల్లా అధ్యక్షురాలిగా లకావత్ ధన్వంతి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా బట్టు కరుణాకర్ , మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భూక్య ఉమను నియమిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది.

#### గిరిజన మహిళకు అవకాశం..

జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా లకావత్ ధన్వంతిని నియమించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ధన్వంతి గతంలో వరంగల్ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గా పని చేసిన విషయం తెలిసిందే. ఓ గిరిజన మహిళకు కాంగ్రెస్ అధిష్టానం సామాజిక ప్రాధాన్యత ఇచ్చి జిల్లా పీఠాన్ని కట్టబెట్టడంపై లంబాడీలు, ఇతర వర్గాల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధన్వంతి భర్త డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా సేవలందిస్తున్నారు.



4

## పెన్నే.. గన్ను అయ్యింది

- కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
- ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
- చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
- అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

### మహిళలను కోటీశ్వరులను చేయడమే

## ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి
- చేర్యాలలో ఇందిరా మహిళ శక్తి చీరలు పంపిణీ
- పాల్గొన్న ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా



**చేర్యాల, మన చౌరాస్తా :**

రాష్ట్రంలో కోటి మంది మహిళను కోటేశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రగతి ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం చేర్యాల,మద్దూరు,కొమురవెల్లి, ధూల్మిట్ట మండలాల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి,జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎంపీ మాట్లాడుతూ కోటి మహిళలను కోటేశ్వరులను చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి మహిళా శక్తి ద్వారా క్యాంటీన్,ఐకెపి సెంటర్,



బస్సుల కొనుగోలు వంటి పథకాలను చేపట్టారని ప్రజా సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలు మళ్ళీ మమ్ములను దీవిస్తారని అన్నారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ..జిల్లాలో మహిళా సంఘాలు బ్రహ్మాండంగా పనిచేస్తున్నాయని,ఐకేపీ సెంటర్ల ద్వారా పెద్ద ఎత్తున వడ్ల కొనుగోలు చేస్తున్నారని, చాకలి ఐలమ్మ పుట్టిన ప్రాంతంలో మీరంతా పని చేయడంలో వెనుకాడని మహిళలు అని అన్నారు.

#### ఆసుపత్రి భవనం ప్రారంభం

చేర్యాల మున్సిపల్ కేంద్రంలో రూ.8.7 కోట్లతో నిర్మించిన 30పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే పల్లా, ఎంపీ చామల ప్రారంభించారు. కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమావతి, ఆర్డిఓ, నాలుగు మండలాల తహసీల్దార్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చీరలు మహిళలందరికీ ఇవ్వాలి

## ■ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి రెండు ముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా, ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సమూహాల మహిళలకు ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు చీరలను సమయానికి అందించేదని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చీరలను కేవలం డ్వాక్రా సంఘాల మహిళలకే కాకుండా రాష్ట్రంలోని ప్రతి మహిళకు సమానంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్షా లోమ్, ఆర్టీఏ మెంబర్ అభిగౌడ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ




**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండలోని డిసిసి బ్యాంక్ ఆడిటోరియంలో వరంగల్ జిల్లాకు సంబంధించి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం హైదరాబాద్ నుండి పాల్గొని వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెక్కాబ్ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్డిఓ, సెర్ఫ్ అధికారులు, సిబ్బంది మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తి, ఐనవోలు మండలాల్లోని మహిళలకు హన్మకొండ హరిత కాకతీయ హోటల్ నందు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, ఇందిరా మహిళా శక్తి పేరుతో మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రులు సీతక్క, కొండా సురేఖ మొదటి నుంచి పరిశీలిస్తూ అద్భుతమైన డిజైన్లలో నాణ్యతతో చీరలను రూపొందించారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఉచిత బస్సుపై ప్రతిపక్ష పార్టీలు కావాలనే దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు ప్రజా ప్రతినిధులుగా పోటీ చేసి రాణించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు హసన్ పర్తి, ఐనవోలు మండలాల



సమైక్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి

## – సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్తిరెడ్డి




**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్ లను అమలుకు విడుదల చేసిన నోటిఫికేషన్ ను ఉపసంహరించుకోవాలని కొమురవెల్లి మండల కేంద్రంలో సిఐటియు కొమురవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడు లను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాడని పని గంటల పెంచి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆయన అన్నారు . కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ యాజమాన్యాల ప్రయోజనాలను కాపాడి కార్మికులను బానిసలుగా మార్చే విధంగా కేంద్రం తీసుకువచ్చిన కోడు లు ఉన్నాయని ఆయన అన్నారు కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు విడుదల చేసిన నోటిఫికేషన్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రోడ్డు నరసింహులు రవి కవిత సుశీల చంద్రం తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే పల్లా

**జనగామ, మన చౌరాస్తా :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జల్ సంచయ్ - జన్ భాగిదారీ' కార్యక్రమంలో సౌత్ జోన్‌లో జనగామ జిల్లా రెండో స్థానాన్ని సాధించింది. జనగామ జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాను జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పోకల జమున, బీఆర్ఎస్ సీనియర్ నేత బండా యాదగిరిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాండు, అనిత, స్వరూప, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ తదితరులు ఉన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ను తనిఖీ చేసిన జిల్లా రిజిస్ట్రార్



**వరంగల్, మన చౌరాస్తా :** నగరంలోని ఉర్సు గుట్ట వద్ద ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్టర్ ప్రవీణ్ కుమార్ శనివారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో జరుగుతున్న ఆస్తుల రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు మరియు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వారికి ఇబ్బందులు కలగకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు రికార్డులను ఆన్లైన్ చేయాలని సూచించారు. సాధారణ తనిఖీలలో భాగంగానే ఖిలా వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని సందర్శించినట్లు డీఆర్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ సబ్ రిజిస్టర్ వెంకట్ లాల్ మరియు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



# కొమురవెల్లిలో వందేమాతరం గీతాలాపన

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు వందేమాతరం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సామూహిక వందేమాతరం గీతా ఆలాపన కార్యక్రమంలో భాగంగా కొమురవెల్లి మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి సామూహిక వందేమాతర గీత ఆలపన చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దండ్యాల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ బంకీం చంద్ర ఛటర్జీ చేతిలో పురుడోసుకున్న వందేమాతరం లక్షలాదిమంది దేశ భక్తులకు తారక మంత్రం లాగా పనిచేసిందన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షురాలు స్వరూప , ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు దండ్యాల బిక్షపతిరెడ్డి, నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి శ్రీనివాస్, జిల్లా నాయకులు రాజుచారి, బూత్ అధ్యక్షులు శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

# కోర్టు తరలింపును విరమించుకోవాలి




**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హుస్నాబాద్ పట్టణంలోని ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ కోర్టు (న్యాయస్థానాన్ని) ప్రస్తుత స్థలం నుంచి మండలంలోని అటవీ ప్రాంతంలో నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించగా, జూనియర్ సివిల్ కోర్టును తరలింపు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు బీజేపీ నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయ ఏఓ గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయస్థానాన్ని మండలంలోని వేరే చోటుకు తరలించాలని, ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. కోర్టు తరలింపు విషయాన్ని బీజేపీ హుస్నాబాద్ పట్టణ పార్టీ తీవ్రంగా వ్యతిరేకేస్తుంది. గత ఎన్నో ఎండ్లుగా హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు అందుబాటులో ప్రస్తుత కోర్టు ఉందని, కోర్టును వేరే చోటుకు తరలించి, కొత్త నిర్మాణం చేయడం తగదని, ప్రజావసరాల దృష్ట్యా కోర్టును తరలించవద్దని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రస్తుత కోర్టు స్థలం 1.33 గుంటలు విశాలమైన స్థలం ఉంది. కానీ ప్రభుత్వం సబ్ కోర్టు మంజూరు అయితే మండల శివారులోని అటవీ ప్రాంతంలో స్థల పరిశీలన చేయడం హుస్నాబాద్ ప్రాంత న్యాయవాదులు, ప్రజలు, కక్షిదారలు ఇబ్బందులుపడి, రవాణా సౌకర్యాలు, వ్యయప్రయాసలు, దూరభారం ఉండే ఆస్కారం ఉంది. సిద్ధిపేట జిల్లా కోర్టు 27 గుంటల స్థలం, హుజూరాబాద్ కోర్టు 30 గుంటల స్థలంలో పట్టణంలోని నడిబొడ్డున తక్కువ స్థలంలో ఉన్నాయి. అక్కడ అద్భుతమైన అభివృద్ధి జరిగింది. హుస్నాబాద్ పట్టణంలోని కోర్టు వద్ద ఇప్పుడుప్పుడే అభివృద్ధి జరుగుతుంది. ఒక్కవేల సబ్ కోర్టు మంజూరైన ఇప్పుడు ఉన్న స్థలంలోనే అద్భుతమైన నిర్మాణం చేపట్టవచ్చు, ప్రజా అభిప్రాయం, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని హుస్నాబాద్ కోర్టు తరలింపు విషయాన్ని విరమించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ని, ప్రభుత్వాన్ని బీజేపీ హుస్నాబాద్ పట్టణ పార్టీ డిమాండ్ పక్షాన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ మండల మాజీ అధ్యక్షుడు చెక్కబండి విద్యాసాగర్ రెడ్డి, హుస్నాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శులు వడ్డెపల్లి లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు, బీజేపీ సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి, ఆశాడపు శ్రీనివాస్, నారోజు నరేష్, లకవాత్ శారద నాయకులు బీసా శ్రీకాంత్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభం

**హన్మకొండ, మన చౌరాస్తా :** నేరానికి సంబంధించి ఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ రెండవ వాహనాన్ని అందజేసారు. ఈ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇకపై ఎదైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని సంఘటన జరిగిన స్థలం నుండి రక్తమరకలు, వేలిముద్రలతో ఇతర సాక్ష్యాధారాలను సేకరించి ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ మొబైల్ వాహనంలో విధులు నిర్వహించేందుకు ఆరుగురు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్, గుణ శేఖర్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీ లు, ఆర్.ఐలు, ఫింగర్ ప్రింట్ ఇన్స్ స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






## ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ లాల్ బహదూర్ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో 77వ ఎన్సిసి ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు తెలిపారు. భారత సైన్యంలో రెండవ సైనిక దళంగా యువతకు రోల్ మోడల్ గా, దేశానికి ఒక మంచి నాయకులు, ఈశ్వర్ రక్షణ కోసం సైనికులను, జాతీయ సమైక్యత ప్రతిబిమించి యువతను, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగలకు ప్రత్యేక రిజర్వేషన్లు ప్రపంచంలోనే అతిపెద్ద యువతతో ఉన్న ఎన్సిసి భారత రక్షణ రంగానికి కవచంగా పనిచేస్తుందని అన్నారు. ఎల్ బి కళాశాలలో చదువుకున్న ఎన్సిసి క్యాడేట్స్ వందలాది మంది భారత సైన్యంలో పని చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. వ్యాసరచన పోటీలు, ఉపన్యాసం, డ్రిల్లు, రంగోలి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, కౌశిక్, హరిలోకేష్, సిరివెన్నెల, మనుష్య, రజిత, రిషిత తదితరులు పాల్గొన్నారు. పరిపాలన భవనం ముందు ప్రతిజ్ఞ చేయించి, భారీ ర్యాలీ నిర్వహించారు.






## జేఏసీ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలంలోని ఎస్.ఆర్.టి. కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం రోజున వ్యాసరచన పోటీలను నిర్వహించారు. భారత రాజ్యాంగ విశిష్టత అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరచారు. ఈనెల 26న విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్ దేగల సారయ్య తెలిపారు. పోటీలు పారదర్శకంగా, విద్యార్థుల్లో అవగాహన పెంపుదల దిశగా నిర్వహించినట్లు నిర్వాహకులు బేరే యాదగిరి, గాండ్ల పద్మ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి, జేఏసీ నాయకులు దస్తరి ఉమామహేశ్వర్, చుంచు ఐలయ్య, తాళ్లపల్లి ఆశీర్వాదం, సింధు, కుమారస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## రిజర్వేషన్ల జాబితా విడుదల

- 232 వార్డులకు కేటాయింపు పూర్తి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన జీవోతో భీమదేవరపల్లి మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మొత్తం 25 గ్రామాలకు సంబంధించిన రిజర్వేషన్ వివరాలను మండల అధికారులు ప్రకటించారు. మండల వ్యాప్తంగా ఉన్న 232 వార్డుల్లో మహిళలకు 100, జనరల్‌కు 132 వార్డులు కేటాయించగా, కులవర్గాల వారీగా రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్టీ మహిళలు 06, ఎస్టీ జనరల్ 13, ఎస్సీ మహిళలు 18, ఎస్సీ జనరల్ 22, బీసీ మహిళలు 24, బీసీ జనరల్ 33 స్థానాల్లో మొత్తం 52 రిజర్వ్ స్థానాలు, 64 జనరల్ స్థానాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రిజర్వేషన్ల ప్రకటనతో భీమదేవరపల్లి మండలంలో ఎన్నికల వేడి పెరిగింది. ఆశావాహులు, నాయకుల మధ్య రాజకీయం వేగం పుంజుకుంది. పలు గ్రామాల్లో రిజర్వేషన్లు మారడంతో అక్కడి సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక, వ్యూహాలు, పార్టీ చర్చలు ఇప్పటికే వేగంగా జరుగుతుండగా, త్వరలోనే ప్రచార సంగ్రామం రంగంలోకి దిగనుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ సర్వ సభ్య సమావేశం

**హనుకొండ, మన చౌరాస్తా :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా సర్వ సభ్య సమావేశం ఈ బుధవారం ఉదయం 10:00 గంటలకు సుబేదారిలోని సమీకృత కార్యాలయ భవనం (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్) లో నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, సర్వ సభ్య సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణపై చర్చించడానికి శనివారం నాడు రెడ్ క్రాస్ భవన్‌లో చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్వ సభ్య సమావేశం విజయవంతంగా నిర్వహించడంపై, అలాగే రెడ్ క్రాస్ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ మాగంటి శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, చెన్నమనేని జయశ్రీ, రమణ రెడ్డి పాల్గొన్నారు.








# పెన్నే.. గన్ను అయ్యింది

- కవులు, కళాకారులతోనే తెలంగాణ సాకారం
- ఉద్యమకారులను నాటి పాలకులు విస్మరించారు
- చదువుకోని అందెశ్రీ రాష్ట్ర గీతం అందించిన ఘనుడు
- ఆయన లేకుండా తెలంగాణ ఉద్యమసభలు లేవు
- అందెశ్రీ సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారే ముందుండి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లారని అన్నారు. వారు లేకుంటే తెలంగాణ లేదని అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైందని, ఇది ఎవరూ కాదనలేని నిజమన్నారు. అంతేగాకాకుండా వారే తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసారని అన్నారు.. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. బడికి వెళ్ళని అందె శ్రీ రాసిన జయ జయ హే తెలంగాణ గీతం రాసిన చరిత్ర తెలంగాణకు ఉంది అని రేవంత్ తెలిపారు. బాధతో.. ఉద్వేగంతో చెప్తున్నా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటకు గౌరవం దక్కాలని కోరుకున్నారు. ఉద్యమంలో ప్రతి నాలుక మీద, ప్రతి వేదిక మీద జయ జయ జయహే తెలంగాణ పాట నిలిచించింది.. తెలంగాణ గీతం స్ఫూర్తి నింపిన కవులు, రచయితలను కించపరిచే విధంగా గత పాలకుల చర్యలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు.అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదని గుర్తు చేశారు. ఊరూరా పాటలతో అందెశ్రీ ఉద్యమానికి ఊపిరిలూదారని అన్నారు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. ఆయనను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచిందన్నారు. . తెలంగాణ

ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం ఆనాడు జరిగిందన్నారు. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారని సిఎం రేవంత్ అన్నారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులని తెలంగాణ ఉద్యమమే రుజువు చేసిందన్నారు.ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని, అందుకు నడుస్తున్న చరిత్రే సాక్షాత్కారమని అన్నారు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకంఅని సీఎం అన్నారు. తెలంగాణ ప్రాంతం ఎంత ప్రేమ చూపిస్తుందో.. అంతే పోరాటాన్ని కూడా చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులూ ఎన్నో పోరాటాలు చేశారు.. గతంలో నిజాం సర్కార్ వాళ్ళను సైతం ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తెలంగాణకు ఉందని సీఎం చెప్పారు. గద్దర్, గోరేటి వెంకన్న వంటి ఉద్యమ కారులు తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని రూపకల్పన చేశారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం జయ జయ హే తెలంగాణ పాటను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన రావాలని అందె శ్రీ, గద్దర్ అన్న లాంటి వాళ్ళ స్ఫూర్తి తోనే ఏర్పడిరది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వారి కుటుంబాలకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. వారి కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 9 మంది ఉద్యమ కారులను గుర్తించడం జరిగింది. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఫ్యూచర్ సిటీలో వారి కుటుంబానికి ఇళ్లను నిర్మించి అండగా నిలుస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర తెలంగాణ ఉద్యమ కారులది. దేశంలో ఎస్సి వర్గీకరణ అమలు చేసిన చరిత్ర తెలంగాణ రాష్ట్రానిది. వర్గీకరణ అనేది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.. అలాగే సమాజాన్ని ముందుకు నడిపించాలానే ఉద్దేశంతో నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రమంత్రి వర్గంలో దళితులకు పెద్ద పీట వేయడం అనేది సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకే నిర్ణయాలు తీసుకున్నాం.' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

సమాజంలో ఎన్ని వజ్రాలు ఉన్నా కోహినూర్ వజ్రనిదే అసలైన గొప్పతనం.. అలాగే కళాకారులు ఎంతమంది ఉన్నా అందె శ్రీ అన్న.. కోహినూర్ వజ్రంలా నిలుస్తాడు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటం వద్ద అందరూ నివాళి అర్పించారు. జయజయహేతో సభ మార్మోగింది. అందెశ్రీ అమర్ రహే అన్న నినాదాలు మిన్నంటాయి.